# హితవు

ఆటో దిగి కాంప్లెక్స్‌లో అడుగుపెట్టాడు ఆనందరావు. 'విజయనగరం, భద్రాచలం ఎక్స్‌ప్రెస్ సర్వీసు ఇరవయ్యో నెంబరు ప్లాట్‌ఫారం నుంచి బయలుదేరడానికి సిద్ధంగా ఉంది' అనౌన్సరు గొంతు ఖంగుమంది.

బస్సెక్కడ మిస్సయిపోతుందోనన్న కంగారులో పరుగెడుతున్నట్లే వెళ్ళి టిక్కెట్టు తీసుకుని సీట్లో కూర్చున్నాడు.

కండక్టరు రైట్ చెప్పాడు.

బస్సు కదిలింది.

సర్టిఫికెట్లన్నీ ఉన్నాయో లేవోనని ఫైలునోమారు తిరగేసి 'హమ్మయ్య' అనుకుని ఊపిరి పీల్చుకున్నాడు. అవేళ మధ్యాహ్నం మూడు గంటలకి ఒక ప్రసిద్ధ ప్రైవేటు ఫర్మ్‌లో ఇంటర్వ్యూ. తనకీ ఉద్యోగం తప్పకుండా అవుతుందన్న గట్టి నమ్మకంతో ఉన్నాడు. అప్పటికే ఉద్యోగం కోసం లెక్కలేనన్ని దరఖాస్తులు చేసి ఎన్నెన్నో ఇంటర్వ్యూలకు వెళ్ళడం జరిగింది. అయితే ఎక్కడా తన ప్రయత్నం ఫలించలేదు. ఇకపైన ఇంటర్వ్యూలకు డబ్బు అడగొద్దని ఇవాళ నాన్న కరాకండిగా చెప్పేశాడు ఆయన మాత్రం ఏం చేస్తాడు? రాని ఉద్యోగం కోసం ఎంతని ఖర్చు పెట్టగలడు? ఇది తన చివరి ప్రయత్నం ప్రస్తుతం ఫేస్ చెయ్యబోయే ఉద్యోగానికి కావలసిన అర్హతలన్నీ ఉండటంతో ధీమాగా ఉందతడి మనసు.

జూట్ మిల్లు దాటగానే బస్సు స్పీడందుకుంది. అంతకంటె వేగంగా

పరిగెడుతున్నాయి అతడి ఆలోచనలు. భగవంతుడి దయవల్ల తనకీ ఉద్యోగం అయిపోతే కష్టాలన్నీ తీరిపోతాయి. ఇంట్లో వాళ్ళందర్నీ సుఖ పెట్టొచ్చు. మొదటి జీతం అందగానే అమ్మకి మంచి చీర కొనాలి. రెండో నెల జీతంతో నాన్నకి రిస్టువాచి తీసుకోవాలి. పాపం తమ్ముడు డిగ్రీ చదువుతున్నాడన్న మాటేగాని వాడికి కాలేజీ కెళ్ళేందుకు సరయిన బట్టలే లేవు. రెండో మూడో జతలుంటే అవే ఉతుక్కుని వేసుకుంటున్నాడు. చేతిలో డబ్బు ఆడితే వాడికి నాలుగు టీషర్టులు, జీన్ ఫ్యాంట్లు కొనివ్వాలి అనుకున్నాడు

బస్సు పది గంటలకి నర్సీపట్నం చేరుకుంది. "ఊళ్ళో దిగగానే ముందు పార్వతక్క ఇంటికెళ్ళి భోంచేసి కాస్సేపు విశ్రాంతి తీసుకుని వెళ్ళు" వచ్చే ముందు తల్లి చెప్పిన మాటలు గుర్తొచ్చి బస్సు దిగుతూనే బావగారి ఇంటి అడ్రసు చెప్పి ఆటో ఎక్కాడు ఆనందరావు.

తలవని తలంపుగా తలుపు తట్టిన తమ్ముణ్ణి చూసి తెగ సంబరపడిపోయింది పార్వతి. "బావగారు లేరా" అడిగాడు పరిసరాలు కలియజూస్తూ.

"ఇంకా పక్కమీంచి లేవలేదు"

"నైట్ డ్యూటీ చేశారేమో!"

"అదేం లేదు. పదిగంటల వరకు పడుకోడం ఆయన అలావాటు. లేచే టైమయింది. ఇంతకీ నువ్వేం తాగుతావ్ కాఫీయా? టీలా?" అడిగింది పార్వతి.

"ఏదో ఒకటివ్వు. ఇవాళ మధ్యాహ్నం ఇంటర్వ్యూ ఉంది. వచ్చిన విషయం వివరించాడు ఆనందరావు.

బావమరిది మాటలు విన్నాడేమో "ఏం ఉద్యోగాని కేమిటి? కలెక్టరు పోస్టుకు కాదు కదా!" అంటూ గదిలో నుంచి బయటకొచ్చాడు గణపతి.

అతడి మాటల్లో ఎగతాళి ధ్వనిస్తోంది. నిద్ర లేనందునేమో ముఖం ఎర్రగా కందగడ్డలా ఉంది. కళ్ళు నిప్పుకణికల్లా ఉన్నాయి.

అతడి మాటలు చిరాకు పుట్టించినా తమాయించుకుంటూ "కలెక్టరు ఉద్యోగం మనకెవడిస్తాడు బావా?. . . ఇక్కడో ఫర్మ్‌లో చిన్న పోస్టుంటే . . ." అంటు

నసిగాడు. "సరేలే" బ్రష్ మీద పేస్టు పెట్టుకుని బాత్‌రూంలోకి దారితీశాడు గణపతి.

రాక రాక వచ్చిన తమ్ముడికి ఇష్టమైనవి వండింది పార్వతి. బావమరిది వచ్చాడన్న నెపంతో ఆ రోజు ఆఫీసుకి ఎగనామం పెట్టాడు గణపతి. అర్ధాంగి వండి వడ్డించిన పదార్థాల్ని చూసి విస్తుపోతూ, "మీ వాళ్ళొస్తే నీకు వళ్ళు తెలీదు" అన్నాడు గణపతి.

అతడి మాటల్లోఅంతర్లీనంగా దుబారా చేస్తున్నావన్న అర్థం స్ఫురిస్తోంది.

ఆనందరావు మనసు చివుక్కుమంది. అయినా ఆ మాట విననట్లుగా నటిస్తూ భోజనం కానిచ్చాడు.

"ఇంటర్వ్యూ సేసే వాళ్ళకి నా పేరు చెప్పవోయ్, నీకు తప్పకుండా ఉద్యోగమిస్తారు" తనకెంతో పలుకుబడి ఉన్నట్టు గర్వంగా అన్నాడు గణపతి కంచంలో చేతులు కడుక్కుంటూ.

"అలాగే" అన్నాడు ఆనందరావు చిన్నగా నవ్వి.

"పని అయిపోగానే అటునుంచి అటు ఊరికెళ్ళిపోకుండా ఇంటికొచ్చి కనిపించి మరీ వెళ్ళు" అన్నది పార్వతి.

"అలాగేలే అక్కా నీకే సంగతి చెప్పకుండా వెళ్ళి పోతానా" అంటూ ముందుకు సాగాడు ఆనందరావు.

అంతలో ఆమెకేదో స్ఫురణకొచ్చి "రేయ్ ఆనందం" అంటూ వెనక్కి పిలిచింది.

అప్పటికే అతడు గుమ్మం దిగిపోవడం వల్ల పిలుపు అందలేదు.

నిట్టూరుస్తూ లోపలకొచ్చింది పార్వతి.

కాల్ లెటరు లోపలకు పంపించి డైరెక్టరు గారి పిలుపు కోసం కాసుక్కూర్చున్నాడు ఆనందరావు.

అరగంట తర్వాత అటెండరొచ్చి "ఎమ్.డి.గారు పిలుస్తున్నారు" అన్నాడు.

ఠక్కున లేచి టక్ సర్దుకుని లోపలకెళ్ళి ఎమ్.డి: గార్ని విష్ చేశాడు ఆనందరావు.

"ప్లీజ్ బి సీటెడ్" కుర్చీ చూపించాడు డైరెక్టర్ ధర్మేంద్ర.

సర్టిఫికెట్ల ఫైలు వినయంగా అతడికందించి ఒద్దికగా కూర్చున్నాడు ఆనందరావు.

"మేం ఫస్ట్ క్లాస్ కంప్యూటర్ సైన్సు గ్రాడ్యుయేట్స్‌ని కాల్‌ఫర్ చేస్తే ఎక్కువగా బి.ఎ., బి. కాం. వాళ్ళొచ్చారు ఒకరిద్దరు సైన్సు గ్రాడ్యుయేట్స్ వచ్చినా వాళ్ళకు బొత్తిగా కంప్యూటర్ నాలెడ్జి లేదు. మాకు కావలసిన అర్హతలన్నీ మీకున్నాయి. గుడ్" అన్నాడు ధర్మేంద్ర సర్టిఫికెట్లు పరిశీలిస్తూ.

ఆ మాటకి ఏమనాలో తెలీక 'థాంక్యూ' అని ఊరుకున్నాడు ఆనందరావు.

"యు ఆర్ ఫ్రమ్ విజయనగరం. ఈజ్ ఇట్?"

"'ఔన్సార్"

"ఉద్యోగంలో చేరింతర్వాత మీరిక్కడే ఉండాలి. అప్ అండ్ డౌన్ చేస్తానంటే కుదర్దు" "లేదు సార్, నేనిక్కడే ఉంటాను. ఈ ఊళ్ళో మా సిస్టర్ ఉంది. నాకే ఇబ్బంది లేద "

"అలాగైతే మరీ మంచిది" అంటూ పోస్టింగ్ ఆర్డరు తయారు చేయమని చెప్పేందుకు కాబోలు పి.ఎ.ని పిలిచాడు ధర్మేంద్ర.

"మీకు మా బావగారు తెలిసే ఉండొచ్చు. ఆయన ఇక్కడ గిరిజన కార్పొరేషన్‌లో పనిచేస్తున్నారు" బావగారి మాట గుర్తొచ్చి అన్నాడు ఆనందరావు.

"ఐసీ. హిజ్ గుడ్ నేమ్ ప్లీజ్"

"గణపతి గారు"

"వ్యాట్! గణపతి మీ బ్రదరిన్లానా?!" విస్మయం వ్యక్తం చేశాడు ఎమ్.డి.

"ఔనండి"

"సరే, మీరిక వెళ్ళొచ్చు"

"మరి నా ఉ. . . ద్యో. . . గం. . ." అన్నాడు ఆనంద రావు ఎమ్.డి. గారిలో సడన్‌గా వచ్చిన మార్పుకు విస్తుపోతూ.

"ఐ విల్ ఇన్‌ఫారం యు లేటర్"

మరి మాట్లాడేందుకు అవకాశమివ్వకపోవడంతో లేచి బయటకొచ్చేశాడు ఆనందరావు. ముందు మెచ్చుకున్నవాడు తర్వాత సడన్‌గా మాటెందుకు మార్చాడో

బోధపడటంలేదు.

ఆ ముక్కే అక్కతో అంటో, ఎంతగానో నొచ్చుకుంది పార్వతి.

"వాళ్ళకి బావగారి పేరు చెప్పవద్దని చెప్పేందుకే నిన్ను వెనక్కి పిలిచాను. అయితే అప్పటికే నువ్వు గుమ్మం దిగిపోయావు"

ఆ మాటకు మరింత ఆశ్చర్యపోయాడు ఆనందరావు. "అదేమిటక్కా అలా అంటావ్?. . . ఆయిన పేరు చెబితే ఏం?. . ." అన్నాడు ఆనందరావు.

"మీ బావగారు వట్టి తాగుబోతు. 24 గంటలూ అతనికి మందుండాలి. ఈ ఊళ్ళో అతని మీద ఎవరికీ సదభిప్రాయం లేదు. పక్కా తాగుబోతుగా పేరు తెచ్చుకున్నారు. ఆయన పట్టుకొచ్చే జీతంలో మూడొంతులు అతడి మందుకే పోతుంది. తాగి పనిలోకెళ్లిన కారణంగా రెండుమార్లు సస్పెండయ్యారు కూడ. చెప్పుకుంటే సిగ్గు. మొన్న ఓ రోజు పీకలదాకా తాగి రోడ్డు మీద పడితే తెలిసిన వారెవరో దయతలచి అతడిని ఇంటికి మోసుకొచ్చారు. ఇవాళ ఉదయం నువ్వు వచ్చే సరికి ఆయన ఇంకా పక్కమీంచి లేవలేకపోడానికి కారణం రాత్రి పూటుగా తాగడమే. మీ బావగారు పచ్చి తాగుబోతని ఈ ఊళ్ళో అందరికీ తెలుసు. అటు వంటప్పుడు అతని బావమరిదైన నువ్వు శుద్ధాత్ముడవని ఎలా అనుకుంటారు? ఆయన పేరు చెప్పి నువ్వు చాలా తప్పుపని చేశావు" అంది పార్వతి.

ఏమనాలో తెలీలేదు ఆనందరావుకి.

"తాగుడు తనకే కాదు. తన సంబంధీకులందరికి హాని కలిగిస్తుంది. ఆవిడెవరనుకుంటున్నావ్ ఆ తాగుబోతు భార్య. వాడా తాగుబోతు తమ్ముడే. ఆ అమ్మాయి ఆ తాగుబోతు కూతురు అంటూ సంఘం అయిన వాళ్ళందర్నీ చులకనగా చూస్తుంది. తాగేవాడు హితుడైనా, సన్నిహితుడైనా అతడిని దూరంగా ఉంచాలి. ఎక్కడా అతగాడి పేరు ఉచ్చరించనైనా ఉచ్చరించ కూడదు" అంటూ హితవు పలికింది.

**(జూన్ 2007 పత్రిక మంత్లీ)**